# నిలువెల్లా గుండె

ఆ రోజు నేను ఆఫీసులోని నా సీటుకు వెళ్లేసరికి రామా రావు నా కోసమే ఎదురుచూస్తున్నట్టున్నాడు.

దుఃఖభారం తలమీదున్నట్టుగా, నేను వచ్చినప్పటికీ, తలవంచుకునే నిలబడి వున్నాడు.

"అప్పుడే వచ్చేసేరేవిటి?" అని పలకరించేడు నవ్వుతూ.

అప్పుడు తలెత్తేడు. బాధల సెగతో మరిగిన ఎసరులా దుఃఖం ఉబికి ఉబికి తన్నేస్తోంది. పెదాలతో బిగబట్టటం మూలాన ఆవిరిపట్టిన ముఖంలా ఎర్రగా ఉన్నాడు. సూటిగా నా కళ్ళల్లోకి చూస్తే తన దుఃఖం తెలిసిపోతుందేమో నన్నట్టుగా కనురెప్పలు టపటప కొట్టుకుంటూ, నిమిషానికి పదిసార్లు చేత్తో ముఖాన్ని రుద్దుకుంటున్నాడు.

"ఏవిటి? అనడిగేను ఆత్రుతగా.

"లావణ్య చూసేరా ఏమందో?"

"ఏవంది?"

"మిమ్మల్నింతవరకూ బ్రాహ్మలనే అనుకుంటున్నాను సుమండీ....అని అందండీ...."

అంటే: అతను బ్రాహ్మల్లా ఉండాలనా? ఉండాలని అనుకుంటున్నాడనా? లావణ్యలాంటి వాళ్ళని మభ్యపెట్ట జూస్తున్నాడనా? లేక మరేవైనా అర్థముందా?

మనుషుల్ని మనుషులుగా ప్రేమించే తత్వం ఉండటం వల్ల రామారావు ఏ సంభాషణలో పాల్గొన్నా కులప్రసక్తి రానివ్వడు. దానివల్ల లేనిపోని రగడలూ, తగువులూ, మనశ్శాంతి లేకపోవడమూ అని తెలిసి అటువంటి వాతావరణం ఉన్న చోటికి దూరంగా ఉంటాడు.

ఈ విధమైన రామారావు తత్వాన్ని రెండర్థాల సినిమా కవిత్వం వంటబట్టిన స్టాఫ్ మెంబర్లు కొందరు — "గురుడు రిజర్వ్డు" అనుకుంటూండడం విన్పిస్తుంటుంది.

ఒకసారి పక్కసీటు పద్మనాభం ఏదో సందర్భంలో రామారావు గురించి "చూడండీ మేనేజరు మనందర్నీ కలిపి తిట్టేడు....రామారావు గురించి మాత్రం కాంప్లిమెంటు పారేసేడు. అందులోనూ గురుడు రిజర్వ్డే..." అన్నాడు వెకిలిగా నవ్వుతూ.

నేనేం మాట్లాడలేదు.

"మీరేవిటి అఫెండయ్యేరు?" అన్నాడు తిరిగి.

"మీ ఉద్దేశ్యం స్పష్టంగా తెలియనేలేదు. ఇంక అఫెండయ్యేదేవుంది" అన్నాను చురుగ్గా. అంత అర్థం లేకుండా

మాట్లాడేవురా వాజమ్మా' అని ధ్వనించి ఉండాలి పద్మనాభానికి.

"ఏవుందండి ...రామారావు రిజర్వ్డు సీటుకదా.... ముట్టుకోవడానికి వీల్లేదు. ముట్టుకున్నామా అంటుకుందన్న మాటే....మంత్రజలం చల్లినా మైలపోదుగదా...." అన్నాడు వెధవ నవ్వు నవ్వుతూ.

ఎలా వీళ్ళని ఎడ్యుకేట్ చెయ్యడమా అని ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయేను.

"ఇప్పుడూ ఏం చెప్పలేదు మీరు...." అన్నాడు మళ్ళీ.

చూడండి....పద్మనాభంగారూ....రామారావు రిజర్వేషను మీద ఉద్యోగంలోకి వచ్చినమాట నిజమే. కానీ మీరు అతని పట్ల వ్యంగ్యంగా మాటాడుతున్న మాటలు మీ గుణాన్ని మాత్రమే వ్యక్తం చేస్తున్నాయి. ఇక రామారావు గురించిన కాంప్లిమెంటు సంగతి ...మనల్ని తిట్టినప్పటికీ ఆ విషయంలో మేనేజర్ని అభినందించాల్సిందే."

అని జవాబిచ్చేను. మనసులోనే మూతి మూడు వంకర్లు తిప్పుకున్నట్టు కొంకర్లుపోయిన అతని ముఖమే చెప్పింది.

-రామారావు ముఖంలోకి చూసేను. టేబిలు మీదున్న పేపర్ వెయిట్ని గిర్రున తిప్పుతూ తీవ్రంగా దాన్నే చూస్తున్నాడు.

"మరి లావణ్య మాటకి మీరేవన్నారు?" అనడిగేను కూల్‌గా.

"లావణ్య ఉద్యోగంలో చేరి కొద్దికాలమే అయ్యింది.... అయినప్పటికీ వర్కులో సీనియర్లం నన్నూ, పద్మనాభాన్నీ మించిపోయిందని మీరే ఒకసారి అన్నారు గుర్తుందాసార్. వర్కులోనే కాదు అన్ని విషయాల్లోనూ ఆమె చొరవా, ప్రజ్ఞా ఎంతో గొప్పవండి. ఆలోచనలు కూడా అభ్యుదయ దృక్పథంతో కూడినవని అనుకుంటూ వచ్చేను సార్. కాని పాదరసం లాంటి లావణ్య బుద్ధికూడా జారిపోయి ఛిన్నాభిన్నం కావడం ఆ ఒక్కమాటతో తెలుసుకుని బాధపడుతూ మౌనంగా అక్కడి నుండి వెళ్ళిపోయేనుసార్...." అని లావణ్యను గురించి తన మనసులో ఉన్న అభిప్రాయాలను ఒకొక్కటిగా తీసి మడత విప్పి టేబిలు మీద పరుస్తున్నట్లుగా చూపించేడు రామారావు.

అతన్ని మనసులోనే మెచ్చుకున్నాను. ఒక మనిషి తనను కించపరచినప్పటికీ పరోక్షంలో కూడా ఆ మనిషిని అగౌరవపరచని అతని వ్యక్తిత్వాన్ని ఎలాగైనా లావణ్య ముందు ఫోకస్ చెయ్యాలి. వెలుగుని గుడ్డివాళ్లు కూడా చూడగలగాలి అనుకున్నాను.

దానికి మర్నాడే ముహూర్తం కుదిరింది.

"మీ నాన్నగారేం చేసేవారండీ?" అనడిగేను లావణ్యని మర్నాడు లంచ్ టైములో.

"తాశీల్దారుగా రిటైరయ్యేరండి."

"మీ తాతగారు?"

"ఆయన రాజావారి సంస్థానంలో పన్జేసేవారు.

"మరి మీ ముత్తాతగారు?"

""ఏమిటండోయ్ మా వంశ వృక్షాన్ని ఓ కుదుపు కుదిపేస్తారేమిటి?" అంది నవ్వుతూ.

"లేదు....చెప్పరూ ..."

"మీరు చెప్పకూడదూ....ఎందుకివన్ని అడుగుతున్నట్టు... ?"

"చెప్తాను, ఈ ప్రశ్నకు జవాబివ్వండి. ఎన్నితరాలుగా చదువుకున్నవారు వున్నారు మీ వంశంలో ...?" నవ్వుతూనే అడిగేను.

"నాకు తెలిసినంతవరకూ తల్లితరఫువారూ, తండ్రి తరఫువారూ అందరూ వేదాలూ, శాస్త్రాలూ చదువుకున్న వారే. ఇంగ్లీషు చదువులు మాత్రం మా తాతగారి నుండి ప్రారంభం అయ్యేయనుకుంటాను."

మీ నాన్నగారి అక్కా చెల్లెళ్ళు ఎవరైనా ఉద్యోగాలు చేస్తున్నారా?"

"స్వంతం కాదుకాని మా నాన్నగారి కజిన్సు ఇద్దరు కాలేజీల్లో లెక్చరర్లుగా పన్జేస్తున్నారు. సరేనా. ఇప్పుడు చెప్పండి మీరు."

"చెపుతున్నాను. ఎన్ని తరాలుగానో మీవాళ్ళు చదువు కుని సంప్రదాయాల్నీ సంస్కారాల్నీ జీర్ణించుకున్నట్టుగా కన్పి స్తోంది. మీకూ, నాకూ తెల్సినంతవరకూ మీలో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేసే స్థాయికి ఎదగడంకూడా మీది రెండోతరం అవునా? అదలావుంచండి. వెనకబడున్న జాతులు, అంట రాని కులాల వాళ్ళు వెలుగులోకి రావాలనుకోవడం, చదువు కోవాలన్న తపన ఉండటం తప్పంటారా?"

"నెవ్వర్"

"మీకు ఈ చదువూ సంస్కారం, తెలివి తేటలూ రావ డానికి వెనుక వంశపారంపర్యపు ప్రభావం ఉండి ఉండొచ్చు నంటే కాదనరనుకుంటాను మరి; ఎన్ని తరాలుగానో అణగ దొక్కబడుతూన్న వారికి మీ కిప్పుడున్నంత చదువూ సంస్కారం, తెలివితేటలూ రావాలంటే వారి వంశం ఎన్ని శాఖలుగా విస్తరించాలి? అన్ని తరాలకి మిగిలినవాళ్ళు ఎంత అవకాశం ఈయాలి?"

"ఇంతకీ మీరనేదేవిటో సూటిగా చెప్పండి"

"నువ్వీపాటికి గ్రహించే ఉంటావు. ఆ అవకాశాల్నే రిజ ర్వేషను అనొచ్చు. అందులో వచ్చిన వాళ్ళందరి వెనుకా అంత వంశపారంపర్యపు పునాది వుండదు. ఉదాహరణకి ఫస్ట్ జనరే షన్‌కి చెందినప్పటికీ....రామారావు మనలో ఏ ఒక్కరికీ తీసి పోడు"

"అవును. ఆ విషయం నేనూ ఒప్పుకుంటాను. కాని సార్....రామారావు గారి మాట అటుంచండి, మెరిట్ మీద ఆధారపడిఉన్న ఉద్యోగాలకికూడా రిజర్వేషనులుండటం...." అంటూ ఆపేసింది.

"నిజమే. కొన్ని ఉద్యోగాలు మెరిట్ మీద ఆధారపడి ఉన్న మాట నిజం. కాని ఆ ఉద్యోగాల్ని మెరిట్ మీద సంపాయించి ఆ ఉద్యోగ నిర్వహణలో మెరిట్‌ని ఉపయోగిస్తూ బాధ్యతలు నిర్వహించేదెందరు? ప్రభుత్వ సంస్థలయితే చెప్పనవసరమే లేదు. ప్రైవేటు సంస్థల్లో కూడా యాజమాన్యాన్ని కాకా పట్టడంలో మాత్రమే మెరిట్‌ను ఉపయోగించునేవారుకున్నారంటే ఏమంటారు?"

"మీరు మరీ ఘోరంగా చెప్తున్నారు. నా ఉద్దేశంలో ఇంజనీరింగూ, మెడిసిన్‌లలో రిజర్వేషనులుండటం ఆ రెండు రంగాలూ దారుణంగా దెబ్బతింటున్నాయని నేనంటే?"

"అంటే ఈనాడు కట్టిన బ్రిడ్జి కూలిపోతుందనే జోకులో, లేకపోతే డాక్టర్ల మీదొచ్చే కార్టూన పల్లనో ఇటువంటి అభిప్రాయాలు వ్యాపించేయని నేనంటాను...."

ఇంకేదో చెప్పబోతున్నాను.

ఇంత టెన్షన్‌తో సాగుతున్న సంభాషణను తెంచుతూ "అయ్యగారు మిమ్మల్ని రమ్మంటున్నారు బాబూ...." అంటూ వచ్చి పిలిస్తే గాని లంచవరు దాటినట్టు గమనించలేదు.

ఓ రెండు రోజులపాటు ఆఫీసు పని ఒత్తిడివల్ల నేను తలపెట్టిన వ్యవహారానికి అంతరాయం కలిగింది. మూడో రోజు లావణ్య కలిసింది.

"ఏవండీ....మీరెప్పుడూ ఆకాశానికెత్తేస్తారే....ఆ మహాను భావుడికి బొత్తిగా సోషల్ బిహేవియర్ లేదేవండీ..." అంది. మొహంలో అతని మీద బేస్ కలర్‌లా ఆసక్తి కనీకనిపించ నట్టున్నా, ఆమె వాడిన పదం దాన్ని ముంచేసినంత గాఢంగా పెయింట్ చేసిందనిపించింది.

"ఏవయ్యింది లావణ్యా ...? అనడిగేను పెద్దరికంతో.

"నిన్న సాయంత్రం ఆఫీసు టైము అయిం తర్వాత నేను వెళ్ళిపోతూ రామారావు గార్ని మా ఇంటికి టీకి రమ్మని పిల్చా నండి....సారీ అనేసి మరో మాటైనా చెప్పకుండా అదేదాటు" అంది లావణ్య.

''అంతేనా'' అన్నాను చప్పరించేస్తూ.

''అంతేనా ఏవిటండీ ...ఎంత అవమానం నాకు. మని షంత మనిషిని, పైగా కొలీగ్‌ని, అందునా ఆడపిల్లని పిలిస్తే మాట్లాడకుండా పోవడమా...' అంది కోపంగా రాగాలు తీస్తూ.

"మంచిపనే చేసేడు లావణ్యా, ఎవరి హద్దుల్లో వాళ్ళుం డడం మంచిదే కదా''

"ఇటువంటి గుణాన్ని హద్దుల్లో ఉండడం అనరు సోషల్ బిహేవియర్ లేకపోవడం అంటారు'' అంది గట్టిగా.

రెండోసారి కూడా ఆదే మాట వినిపించేసరికి చికాకు కల్గింది నాకు.

"అవున్నిజమే. ఎలా వుంటుందమ్మాయ్, తరతరాలుగా అంటరానివాడివంటూ మనుష్యుల్లో లేకుండా చేసేం. వాళ్ళ జీవితం మీదా, బ్రతుకుల మీదా, వాళ్ళ మనుష్యుల మీదా, వాళ్ళ మనసుల మీదా ఎంతగానో దెబ్బతీసేం. దానివల్ల కలిగిన మానసిక వ్యధ వాళ్ళ నరనరాల్లోనూ అణువణువులోనూ తరతరాలుగా నిలిచే వుంటుంది. ఆ బాధ నిలిచినంతకాలం నలుగుర్తో కలిసేలా ఎలా వుంటాడు?" అంటూ తీవ్రమైన గొంతుతో ఆవేశంగా అడిగేన్నేను.

నా ముఖంలోకి చూస్తున్న లావణ్య ఆ మాటల వాడికి, నా చూపుల వేడికి భరించలేనట్టు తలదించుకుంది.

అప్పటికది ఆగినట్టే అనిపించింది.

కాని ఆపైవారమే ఏదో వారపత్రిక పట్టుకుని ఆఫీసుకు వస్తూనే ఆ పత్రిక తెచ్చి నా టేబిలు మీద పెడుతూ "అందులో పేదరికం అన్న కథ పడింది. మీకేమాత్రం రిలీఫ్ దొరికినా అది చదవండి. లంచవర్లో దాని మీద మీతో డిస్కస్ చెయ్యాలి...." అంటూ వెళ్ళిపోయింది.

వీలు చూసుకుని చదివేను. అగ్రకులానికి చెందిన నిరుద్యోగ యువకుడి కథ. ఉద్యోగాన్వేషణలో ఉత్తరాయణం వల్ల దెబ్బతింటాడు, దక్షిణాయనంవల్ల దెబ్బతింటాడు. చివర్లో

రిజర్వేషనువల్ల దెబ్బతింటాడు. మరిక దెబ్బలు తినే ఓపికలేక ఆత్మహత్య చేసుకుంటాడు.

లంచవర్లో చాలా ఆత్రుతగా వచ్చేసింది లావణ్య... "చదివేరా?" అంటూ.

'ఆఁ' అన్నాను టిఫిన్‌బాక్స్ ఒపెన్ చేస్తూ.

"ఎలా వుందంటారు?" అంటూ నా ముఖంలోకి కుతూహలంగా చూసింది.

"నీ ధోరణి చూస్తే ఈ కథ నీకు బాగా నచ్చిందనుకుంటాను...." అన్నాను నవ్వుతూ.

"నాకు నచ్చబట్టి మీకిచ్చేను" అంది.

"కథ సంగతి అలావుంచితే కథకుడి పాలసీ మాత్రం ఏం బాగోలేదు. ఎంచేతనంటావా....ఉత్తరాయణం, దక్షిణాయణం అన్నవి సాంఘిక దురాచారాలు, ఇకపోతే రిజర్వేషను అన్నది...."

"అది కాదా?"

రిజర్వేషన్ను సాంఘిక దురాచారం! ఒక్క క్షణం నిశ్చేష్టుడినై పోయేను."

"ఎలా?" అనిమ్మాత్రం అనగలిగేను.

"పేదరికం అన్నది అగ్రకులానికైనా, అధమ కులానికైనా ఒకటే. అగ్రకులాల్లో పేదరికంతో అలమటించే వాళ్ళెంత

మందో వున్నారు. అంటరాని కులాల్లో ధనవంతులూ ఉన్నారు. న్యాయంగా అయితే పేదరికం ప్రాతిపదికగా రిజర్వేషను లుండాలి గాని కులాలు ప్రాతిపదికగా కాదు .. ఏవంటారు?'' అంది కనుబొమలెగరేస్తూ సవాల్ చేస్తున్నట్టుగా.

"ఏవంటాను....అది ప్రస్తుతం వ్యాపిస్తున్న, వినిపిస్తున్న స్లోగన్...."

"అంతేగాని....నిజం కాదంటారు?''

"అగ్రకులాల్లో పేదలకి అంటరాని వాళ్ళకిచ్చే రిజర్వే షన్లు ఏ విధంగానూ అడ్డురావు. పరిశీలనాత్మకమైన దృక్ప థంతో ఆలోచించు లావణ్యా. మనది ధనస్వామ్యం. కాని అది ఎవరి చేతుల్లో వుంది? అగ్రకులాలవాళ్ళ చేతుల్లో వుంది. డొనేషన్లు కట్టి పెద్ద పెద్ద చదువులు చదువుతున్న వాళ్ళెవరో ఆలోచించావా? అయినప్పటికీ ఏ మూలో అభ్యుదయ శక్తులుండబట్టి ఈ అవకాశాలు వచ్చాయి. ఆ రిజర్వేషనులైనా ఎంతశాతం? పదీపదిహేను...కాదూ ఇరవై, పోనీ ఇరవైఐదు. మిగిలిన వాటిసంగతి? ఓపెన్ కాంపిటీషను పేరుతో యుగయుగాలుగా జరుగుతున్న అంచిచేత కార్యక్ర మమే అమలు జరగడం మంచిదా? ఇన్ని చెబుతున్నావు గాలికి, నీరుకి, నేలకి రిజర్వేషన్లు అమలు జరుపుతూ అంటరాని వారుగా దూరం చేయవచ్చుగానీ, ఉద్యోగాల్లోనూ, చదువుల్లోనూ మాత్రం రిజర్వేషన్లు ఉండకూడదంటావా?

"నేనూ అదే అడుగుతున్నాను. కనీసం పేద విద్యార్థులందరికీ సమానమైన అవకాశాలెందుకు ఇవ్వకూడదూ?"

"పొరబడుతున్నావు లావణ్యా....ఆ అవకాశాలు వాళ్ళ పేదరికానికి కాదు, వాళ్ళ అంటువేతకి పరిహారాలు మాత్రమే"

దేశంలో రిజర్వేషన్ల గురించిన వాదోపవాదాల ప్రభావంతో ఆ కథని సాకుగా తీసుకుని లావణ్య నాతో వాదించింది. అదే రామారావులో ఉన్న వ్యక్తిత్వాన్నీ, మానసిక వ్యథనీ, భావావేశాల్నీ ఫోకస్ చేయడానికి అవకాశంగా నేను తీసుకున్నాను. రామారావు గురించే అయితే ఎక్కడా అతని గురించిన ప్రస్తావన లేకపోయినప్పటికీ-లావణ్యలాంటి వ్యక్తి ముందు ఈపాటి సరిపోయిందనే చెప్పాలి.

అయితే అప్పుడూ అప్పుడూ ఈ విషయం గురించిన ఆలోచనలు చెలరేగితే మాత్రం, లావణ్య ముందు ఆలోచనలు చాలాతక్కువే వ్యక్తపరచగలిగినందుకు బాధపడ్తున్నాను.

నిజానికి రిజర్వేషన్లు ఎంతవరకు నిజాయితీతో అమలు జరుపబడుతున్నాయి? రాజకీయనాయకులు ఈ రిజర్వేషన్లని కేవలం తమ రాజకీయ జీవితానికి సోపానాలుగా వాడుకుంటున్నారు. రిజర్వేషనులు సంఘ వ్యతిరేక చర్యలుగా ఆలోచనల్లో రూపుదిద్దుకోవడానికి కూడా రాజకీయనాయకులే కారణమంటాను.

అయితే ఇవన్నీ లావణ్యా ముందు వ్యక్తపరచనవసరం లేకపోయింది. లావణ్యా పట్ల నా అంచనా తప్పు కావడానికి దాఖలాగా అన్నట్టు మూడు రోజుల తర్వాత లావణ్య నా టేబిలు దగ్గరికి వచ్చి నిలుచుంది.

నేనేదో ఫైల్లో తలదూర్చిఉంటే టేబిలు మీద వేలితో గీతలు గీస్తున్న వ్యక్తి ఎవరా అని తలెత్తేను.

"ఏవిటి లావణ్యా?" అనడిగేను.

"నేను తీసుకున్న నిర్ణయం గురించి మీతో చెప్దామని"

"ఏవిటి చెప్పు"

"........"

"చెప్పు లావణ్యా."

"రామారావు గురించి మీతో కొన్ని విషయాలు చర్చించడం వల్ల నా ఆలోచనా ధోరణి తప్పు అని తెలుసుకున్నాను. రామారావు గురించి ఇప్పుడాలోచిస్తుంటే చాలా ఉన్నతమైన వ్యక్తిలా కనిపిస్తున్నాడు. మరలాంటి వ్యక్తితో జీవితం పంచుకుందామని...నిర్ణయించుకున్నాను."

"బాగా ఆలోచించేవా?"

"కొత్త దృష్టితో ఆలోచించేను."

"నీ తల్లిదండ్రులు....?"

"అడ్డు చెప్పరు. చెప్పినా వాళ్ళని ఒప్పించగలననే అనుకుంటున్నాను."

"నీ జీవితం నీ ఇష్టం. ఇదేగాని జరిగితే నిన్నెంతగానైనా అభినందిస్తాను.''

నా ముఖంలోకి ఓ సారి చూసి వెళ్ళిపోయింది.

ఆ రోజు ఆఫీసులో నా పని ముగించుకుని నా సెక్షను నుండి బయటపడేసరికి చీకటి పడుతోంది.

బయట రామారావున్నాడు.

నాతోపాటే బయల్దేరేడు రామారావు కూడా.

"లావణ్య మీతో మాటాడిందటా?" అన్నాడు కొంత దూరం నిశ్శబ్దంలో కరిగించిన తర్వాత.

"చూడండి సార్. తన నిర్ణయం ఇదీ అంటూ చెప్పిందిగాని నా మనసు గానీ, నా ఇష్టంగానీ ఏవిధంగా ఉంటుందో ఆలోచించలేదు. తనంతటి మనిషి, జీవితం పంచుకోవడానికి వస్తున్నదీ అంటే ఎగిరి గంతేసి అందుకోడూ అనే ఉద్దేశం ఆమెలో వ్యక్తమవుతోంది. అంటే లావణ్య ఆలోచనా సరళి ఏం మారిందంటారు? నరనరాల్లో జీర్ణించుకుపోయిన అహం ఆమె ఆలోచనా సరళిని మారనివ్వలేదు. ఇకపోతే, రెండో పక్క నేను. ఆమె ఇంతకన్నా సాఫ్టగానో, లేకపోతే ప్రేమపూర్వకంగానో చెప్పాల్సిందనే ప్రాక్టికల్ అవుట్‌లుక్‌తో చూస్తే నేను శంకించక తప్పదు. ఇంతగా శంకలు పెట్టుకోవడానికి కారణాలు ఏవైనప్పటికీ కలిసిమెలిసి చెయ్యాల్సిన కాపురంలో

ఎన్ని కలతలు...ఎన్నెన్ని సమస్యలూ..".అంటూ ఆపేసేడు రామారావు.

"నువ్వన్నది నిజమేలే. కాని అందరూ ఇలా అనుకుంటే మనం ముందుకు పోయే దెప్పుడు?"

"కొంతకాలం పోవాలి.కొంతమంది త్యాగాలు చెయ్యాలి. కొంతమంది బలికావాలి అంతవరకూ...." అంటూ ఆపేసి నా ముఖంలోకిచూసి, వస్తానుసార్ అంటూ చీలిన అతని దారిలో నడుచుకుంటూ వెళ్ళి పోసాగేడు రామారావు. ★

కథా నిలయం
3633
శ్రీకాకుళం